# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 318 | పేజీలు: 4 | వెల: రూ.4/- | బుధవారం 15 జులై 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


### ఆర్ఆర్ఆర్ దక్షిణ ప్రాంతానికి
# అనుమతులివ్వండి
## గడ్కరీని కోరిన సీఎం రేవంత్



**ఫ్యూచర్ సిటీ నుంచి బందరుకు.....**

**12 వరుసల రహదారికి.... అనుమతులు ఇవ్వండి**

**రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి..**

**నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ, జులై 14 (నమస్తే ఉదయం)**

రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్ఆర్ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుందుని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్ సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్ధరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ..మిగతా 2లో



### కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా
## వరంగల్ విమానాశ్రయం

**అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మాణం**

**హుస్సేన్ సాగర్ నుంచి... ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు**

**ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి**

**కేంద్ర మంత్రి రామ్మోహన్ తో రేవంత్ రెడ్డి భేటీ**

**న్యూఢిల్లీ, జులై 14 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్నవరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్య పరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను సీఎం వివరించారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయం లోమంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగావరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమైఉండడంతో పాటు ..మిగతా 2లో

## ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

**మరో పది రోజుల్లో ముగియనున్న సర్ ప్రక్రియ**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి**

2లో..

## బోనాలకు భారీగా ఏర్పాట్లు

**భక్తులకు ఇబ్బంది లేకుండా భద్రతా చర్యలు**


**నగర పోలీస్ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష**

**హైదరాబాద్, జులై 14 (నమస్తే ఉదయం)**



ఆషాడ బోనాల ఉత్సవాలు శాంతియు-ఎతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ బోనాలు.. మొదటి 15 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉ ండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని టీజీఐసీసీసీలో ఆషాడ బోనాలపై ఆ శాఖ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష నిర్వహించారు. ఈ బోనాలకు పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జూలై 16 నుంచి ఆగస్టు13వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ ..మిగతా 2లో

# ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్



**నేడు శంకుస్థాపన చేయనున్న సిఎం రేవంత్**

**దివిటిపల్లిలో అమర్ రాజా బ్యాటరీ సెంటర్ ప్రారంభోత్సవం**

**హైదరాబాద్, జులై 14 (నమస్తే ఉదయం)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో పర్యటించి పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు సీఎం రేవంత్ భూమిపూజ చేయనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమరరాజా సెల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించనున్నారు. అలాగే వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల ఉ న్నత పాఠశాల భవనం ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ..మిగతా 2లో

## బీఆర్ఎస్ దోపిడీ వల్లే రాష్ట్రానికి రూ.8.21 లక్షల కోట్ల
## అప్పుల భారం: భట్టి

**మహబూబ్‌నగర్ జులై 14 (నమస్తే ఉదయం)**



గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని నిలువునా దోపిడీ చేసి, రూ. 8 లక్షల 21 వేల కోట్ల అపారమైన అప్పుల ఊబిలోకి నెట్టేసిందని రాష్ట్ర ఉ ప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అలంపూర్ నియోజకవర్గం వడ్డేపల్లి మండలం జులేకల్ గ్రామంలో ఏఐసీసీ సెక్రెటరీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సంపత్ కుమార్ అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాడు తాము రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్‌తో, ధనిక రాష్ట్రంగా అప్పగిస్తే.. గత పాలకుల పదేళ్ల అనాలోచిత నిర్ణయాలు, అవినీతి వల్ల తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని మండిపడ్డారు. రెండున్నరేళ్లలోనే రూ. 2.08 లక్షల కోట్ల చెల్లింపులు గత ప్రభుత్వం తెచ్చిన అప్పుల వల్ల ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆర్థిక భారం పడిందని డిప్యూటీ సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నర సంవత్సరాల కాలంలోనే బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన అప్పులకు సంబంధించి రూ. 2 లక్షల 8 వేల కోట్ల అసలు, వడ్డీలను బ్యాంకులకు చెల్లించాల్సి వచ్చిందని వెల్లడించారు. "రూ. 8 లక్షల 21 వేల కోట్ల భారీ అప్పులు తెచ్చి ఆ నిధులను ఏం ..మిగతా 2లో

### ముద్రగడ పద్మనాభం
## కన్నుమూత

**ఆయన మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు**

**సంతాపం ప్రకటించిన సిఎం రేవంత్ తదితరులు**

**హైదరాబాద్, జులై 14 (నమస్తే ఉదయం)**



వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి(73) మృతిచెందారు. అనారోగ్య సమస్యలతో చికిత్సపొందుతూ మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. కిడ్నీ సమస్యలతో గత నెల 16న హైదరాబాద్ గచ్చిబౌ లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన చేరారు. అప్పటి నుంచి అక్కడ ముద్రగడకి చికిత్స జరుగుతోంది. అయితే ..మిగతా 2లో



### సరిహద్దుల్లో అమెరికన్
## మాజీ సైనికుడి అరెస్ట్

**న్యూఢిల్లీ, జులై 14 (నమస్తే ఉదయం)**

భారత్-నేపాల్ సరిహద్దులో సశస్త్ర సీమా బల్ మరో అమెరికన్‌ను అదుపులోకి తీసుకుంది. అమెరికా డ్రోన్ నిపుణుడు మాథ్యూ వాన్‌డైకన్ను ఇటీవల మణిపుర్‌లోభారత సైన్యం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న అమెరికా మాజీ సైనికుడిని ఎస్ఎస్‌బి అదుపులోకి తీసుకుంది. అతడిని కాలిఫోర్నియాకు చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా గుర్తించారు. సరైన ప్రయాణ పత్రాలు లేకుండా నేపాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా అతడిని ఎస్ఎస్‌బి జవాన్ అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. జవాన్ నుంచి తప్పించుకొని పారిపోతుండగా స్థానికులు పట్టుకొని భద్రతా సిబ్బందికి అప్పగించారన్నారు. విచారణ సమయంలో బ్రౌన్ పొంతన లేని సమాధానాలు చెప్తున్నాడని అధికారులు తెలిపారు. బ్రౌన్ 2025 నవంబర్‌లో సముద్ర మార్గం ద్వారా భారత్‌లోకి ప్రవేశించి.. అప్పటి నుంచి గోవాలో నివసిస్తున్నట్లు గుర్తించామన్నారు. సరైన పత్రాలు లేకుండా భారత్‌లోకి ప్రవేశించినందుకు ఇమిగ్రేషన్ ..మిగతా 2లో

# కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయం



**మొదటి పేజీ తరువాయి...**

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతరపరిశ్రమలతోవరంగల్కీలకనగరంగాఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. ఉత్తరతెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండజిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలోఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగావరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దంపట్టేలా డిజైన్లు ఉండాలనిభావిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణశాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయంనిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణసంస్థలు నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలుసమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీకె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీకోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలుఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలుకీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకుసహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏవైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్ర మంత్రులనుకలిసేందుకు ఢిల్లీకి వస్తున్నామని, దానిపైనా రాజకీయంగా విమర్శలు చేయడం తగదని సీఎం హితవుపలికారు. విమానాశ్రయాలతోనే అనేక దేశాలు అభివృద్ధి చెందాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రాష్ట్రాలు పోటీపడుతున్నాయని తెలిపారు. దేశంలో ఎక్కడాలేనంత త్వరగా తెలంగాణ ప్రభుత్వం విమానశ్రయానికి అవసరమైన భూ సేకరణ చేసి ఇచ్చి చరిత్రసృష్టించిందని ఆయన అభినందించారు. ఇంత త్వరగా స్పందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. భూ సేకరణ, ఇతర అంశాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణ మాదిరే స్పందించాలని కేంద్రం మంత్రి సూచించారు. వరంగల్ సంస్కృతికి అద్దం పట్టేలా విమానాశ్రయ డిజైన్ ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఓ ప్రశ్నకుసమాధానమిచ్చారు.

# సరిహద్దుల్లో అమెరికన్ మాజీ సైనికుడి అరెస్ట్

**మొదటి పేజీ తరువాయి...**

అధికారులు అతడిపై కేసు నమోదు చేశారు. విచారణలో అతడు బెంగళూరు, లఖ్‌నవూ, గోరఖ్‌పూర్‌లకు వెళ్లినట్లు తేలిందన్నారు. తాను కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని.. ఆరేళ్లపాటు అమెరికా సైన్యంలో పని చేశానని బ్రౌన్ వెల్లడించారు. రెండేళ్ల క్రితం సైన్యం నుంచి వైదొలిగానన్నారు. మూడేళ్ల క్రితం తాను ఇటలీ పర్యటనలో ఉన్న సమయంలో ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక భారతీయ మహిళను కలిశానని.. 2024 అక్టోబర్‌లో ఆమెను వివాహం చేసుకున్నానని తెలిపారు. అనంతరం టూరిస్ట్ వీసాపై థారులాండ్ వెళ్లానని.. అక్కడ పాస్‌పోర్టు పోవడంతో తాను సముద్ర మార్గంలో భారత్‌కు వచ్చినట్లు వెల్లడించారు. గోవాలో పరిచయమైన ఓ నేపాల్ వ్యక్తిని కలవడానికి ఆ దేశానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ గురించి ప్రశ్నించగా బెంగళూరులోని ఓ పరిచయస్థుడి వద్ద ఉందని చెప్పారు. కొన్నాళ్ల క్రితం కోల్‌కతాలో అరెస్టైన మాథ్యూ వాన్‌డైక బృందం ఐరోపా నుంచి తెచ్చిన డ్రోన్లను ఈశాన్య భారతం గుండా మయన్మార్‌లోని తిరుగుబాటుదారుల గ్రూపులకు అందించినట్లు సమాచారం. ఇలా డ్రోన్లను దొంగ రవాణా చేయడం, వాటి కూర్పు, మరమ్మతులు, ఎలక్ట్రానిక యుద్ధరీతులలో మయన్మార్ తిరుగుబాటుదారులకు శిక్షణ ఇవ్వడం వాన్‌డైక బృందం పని అని నాడు రష్యా వెల్లడించింది. విదేశీయులు మిజోరంలో ప్రయాణించాలంటే రక్షిత ప్రాంత పర్మిట్ (పీఏపీ) తప్పనిసరి. కానీ, నిందితులు అలాంటి అధికార అనుమతులు లేకుండానే ఈశాన్య భారతం నుంచి మయన్మార్‌లోకి ప్రవేశించారనేది ఆరోపణ.వాన్‌డైక అరెస్టు ఒక కొత్త ధోరణిని సూచిస్తోంది. విదేశీ కిరాయి సైనికులు భారత భూభాగం గుండా ఇతరులకు ఆయుధాలు, డ్రోన్ల బట్వాడాకు నడుంకట్టారు. వారు భారత్‌ను కీలకమైన రవాణా మార్గంగా వాడుకోవాలని చూస్తున్నారు. వాన్‌డైక 'సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్' అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు. లిబియా అంతర్యుద్ధ సమయంలో గడాఫీకి వ్యతిరేకంగా పోరాడటం ద్వారా వార్తల్లోకి వచ్చాడు. మోటార్ సైకిల్‌పై ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లో పర్యటించాడు. సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొన్నాడు. 2022 మార్చి నుంచి అతని సంస్థ ఉక్రెయిన్‌లో రష్యాకు వ్యతిరేకంగా పనిచేస్తోంది.

# బీఆర్ఎస్ దోపిడీ వల్లే రాష్ట్రానికి రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం: భట్టి

**మొదటి పేజీ తరువాయి...**

చేశారయ్యా? రాష్ట్రంపై పడి దోపిడీ చేశారు తప్ప రాష్ట్ర ప్రజలకు పైసా మేలు చేయలేదు. ఇంత ఆర్థిక సంక్షోభంలోనూ మేము ప్రతినెలా రూపాయి రూపాయి పోగేస్తూ.. పాత అప్పులు కడుతూనే సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నాం" అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత ప్రభుత్వ అప్పుల భారాన్ని మోస్తూనే, నాడు ప్రారంభించిన 'షాదీ ముబారక్', 'కల్యాణలక్ష్మి' వంటి పథకాలను ఆపకుండా కంటిన్యూ చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. వీటితో పాటు అదనంగా అనేక విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వం పాత పథకాలను కొనసాగిస్తూనే, అదనంగా ప్రతినెలా ఉద్యోగులకు సకాలంలో జీతాలు, రైతులకు ఉచిత కరెంట్ ఇస్తోందని, మహిళల ఉచిత ప్రయాణానికి గానూ రూ. 12 వేల కోట్లను ఆర్టీసీకి చెల్లించిందని వివరించారు.రూ. 22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, అంతర్జాతీయ ప్రమాణాలతో 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగిజావతో కూడిన ఉదయం అల్పాహారం వంటి విప్లవాత్మక మార్పులు తెచ్చామని చెప్పారు. రాబోయే నవంబర్‌లో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రూ. 5 లక్షల 'ఇందిరమ్మ బీమా' పథకాన్ని ప్రారంభించబోతున్నామని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు.

# ముద్రగడ పద్మనాభం కన్నుమూత

**మొదటి పేజీ తరువాయి...**


సాయంత్రం పరిస్థితి విషమించడంతో ముద్రగడ పద్మనాభరెడ్డి ప్రాణాలు కోల్పోయారు. ముద్రగడ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి. 1953 జనవరి 22న ఆయన జన్మించారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తన జీవిత కాలంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా, ఒకసారి ఎంపీగానూ ఆయన పని చేశారు. ముఖ్యంగా కాపు ఉద్యమ నేతగా ఆయనకు మంచి గుర్తింపు లభించింది. తండ్రి మరణానంతరం 1977లో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జనతా పార్టీ తరఫున ప్రత్తిపాడు నుంచి విజయం సాధించారు. 1982లో తెదేపాలో చేరిన ముద్రగడ.. 1983, 1985, 1989 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. అనంతరం ఆ పదవితో పాటు తెదేపాకు రాజీనామా చేశారు. ప్రజారక్షణ సమితి, తెలుగునాడు పార్టీలను ముద్రగడ పద్మనాభం స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా గెలుపొందారు. కాపు ఉద్యమ నేతగా గుర్తింపు పొందిన ఆయన ఆ సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం దీక్ష చేశారు. 2016లో తునిలో కాపు ఐక్య గర్జన సభ నిర్వహించారు. ముద్రగడ పద్మనాభం గారి ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శాసనసభ్యుడిగా, లోక్ సభ సభ్యుడిగానే కాకుండా ప్రజా నాయకుడిగా సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడారని కొనియాడారు . మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో ముద్రగడ పద్మనాభం పోషించిన పాత్ర చిరస్మరణీయమని, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దేశంలో ఎంతో ప్రభావం చూపించిన విలక్షణ నాయకత్వ లక్షణాలు ఉన్న గొప్ప నాయకులు ముద్రగడ అని అన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ఆయన ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ తనదైన ముద్ర వేసిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. ముద్రగడ పద్మనాభం మరణం రాజకీయ రంగానికి తీరని లోటని పేర్కొన్న మహేష్ కుమార్ గౌడ్.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మరణం పట్ల బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజా జీవితంలో ఆయన తనదైన ముద్ర వేసి, కాపు సామాజిక వర్గ హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభ్యుడిగా, మంత్రిగా ప్రజలకు సేవలందించిన ఆయన రాజకీయ ప్రస్థానం చిరస్మరణీయమై నదన్నారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, అనుచరులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు హరీశ్‌రావు. ముద్రగడ్డ పద్మనాభం మరణపై రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'ఆయన మరణ వార్త ఎంతో దిగ్భ్రాంతి గురి చేసింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని సంతాపం వ్యక్తం చేశారు.

# బస్సు ఆపమంటే విద్యార్థులపై డ్రైవర్ రుబాబు

**కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే మేమేం చేయాలి?**

**ఆర్టీసీ బస్సులు ఆపడం లేదంటూ గోనుపాడు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆవేదన**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 14(నమస్తే ఉదయం):**



నిత్యం పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లేందుకు బస్సుల కోసం గంటల తరబడి వేచి చూస్తున్న విద్యార్థులకు ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యం శాపంగా మారింది. బస్సు ఆపాలని కోరినందుకు ఓ ఆర్టీసీ డ్రైవర్ విద్యార్థులపై తీవ్రంగా రుబాబు చేసిన ఉదంతం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే... గద్వాల మండలం గోనుపాడు పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న వందలాది మంది విద్యార్థులు ప్రతిరోజు గద్వాల ఆర్టీసి బస్సుల ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, ఈ మార్గంలో ప్రయాణించే ఆర్టీసీ బస్సులు చాలావరకు కళాశాల వద్ద ఆపకుండా వెళ్ళిపోతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా, బస్సును ఆపాల్సిందిగా విద్యార్థులు కోరగా బస్సు డ్రైవర్ బండిని నిలపకుండా దురుసుగా ప్రవర్తించాడు. విద్యార్థులు తమ ఇబ్బందులను వివరిస్తూ, ఈ విషయమై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నగా... "కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే మేమేం చేయాలి? మా ఇష్టం వచ్చినట్లే వెళ్తాం" అంటూ డ్రైవర్ బాధ్యతారాహిత్యంగా సమాధానమివడం జరిగిందని విద్యార్థులు ఆరోపించారు. జరిగిన ఘటన పై గద్వాల ఆర్టీసి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎవరు పట్టించుకోవడం లేదని, రవాణ సౌకర్యం లేక విద్యార్థులు చదువులకు ఇబ్బందిగా మారిందని, జిల్లా కలెక్టర్ స్పందించి బస్సు రవాణ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.



# ఆర్ఆర్ఆర్ దక్షిణ ప్రాంతానికి అనుమతులివ్వండి

**మొదటి పేజీ తరువాయి...**

ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్

**మొదటి పేజీ తరువాయి...**

హెలికాప్టర్‌లో రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీకి బయలుదేరుతారు. 12:15 గంటలకు ఫ్యూచర్ సిటీలోని అమెజాన్ డేటా సెంటర్ వేదికకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12:15 నుంచి 12:45 గంటల మధ్య అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ చేస్తారు. అనంతరం 12:50 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లికి పయనమవుతారు. మధ్యాహ్నం 1:15 గంటలకు దివిటిపల్లి చేరుకుని, 1:20 నుంచి 2:20 గంటల మధ్య అమరరాజా సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవం, ప్లాంట్ సందర్శన, అనంతరం ప్రసంగం చేయనున్నారు. ధ్యాహ్నం 2:20 గంటలకు దివిటిపల్లి నుంచి వనపర్తి జిల్లా కొత్తకోటకు హెలికాప్టర్‌లో సీఎం రేవంత్ బయలుదేరుతారు. మధ్యాహ్నం 2:40 గంటలకు కొత్తకోటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2:45 నుంచి 3:45 గంటల మధ్య బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం 3:45 గంటలకు కొత్తకోట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

# ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

**మరో పది రోజుల్లో ముగియనున్న సర్ ప్రక్రియ**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి**

**హైదరాబాద్, జులై 14 (నమస్తే ఉదయం)**

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా అందజేసిన ఎన్యూరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బిఎల్‌ఒలకు వెంటనే అందజేసి ఓటుహక్కును కాపాడుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బిఎల్‌ఒలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తపలు లేకుండా పూరించి, ఫోటోలను అతికించి బిఎల్‌ఒలకు అందించాలని సిఇఒ కోరారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పనిసరిగా ఓటర్ సంతకం, తేదీతో పాటు బిఎల్‌ఒల సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిఎల్‌ఒలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకటి బిఎల్‌ఒలకు ఇవ్వాలని, మరొకటి ఓటర్ భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్‌ఒలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటర్ వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అటువంటి వివరాలను లేకపోయిన ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బిఎల్‌ఒలకు అందజేయాలన్నారు. రాష్ట్రంలోని మె-త్తం3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సమర్పించారు. సర్ పక్రియ జూన్ 25 నాడు ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ఈ పక్రియ ముగుస్తుందని, ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే బిఎల్‌ఒలకు అందజేయాలని సూచించారు.



# బోనాలకు భారీగా ఏర్పాట్లు

**మొదటి పేజీ తరువాయి...**

ఆలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్‌డ్, రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ భారీగా మోహరిస్తున్నట్లు వివరించారు. భక్తులకు సమాచారం కోసం ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వివరించారు. మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని.. అందుకోసం షీ టీమ్స్‌తో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగలపై ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు. గత బోనాల్లో 644 మంది ఆకతాయిలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఆయన గుర్తు చేశారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపులకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని నగర సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకటేశ్వర్లు


రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా డీఈఓ ఎం వెంకటేశ్వర్లు


శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న డీఈఓ ఎం వెంకటేశ్వర్లు

**బుద్వేల్, జూలై 14 (నమస్తే ఉదయం):**

శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాల, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఆయన శివరాంపల్లి ప్రాథమిక పాఠశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాలిని విద్యాశాఖాధికారికి పాఠశాలలో 340 మంది విద్యార్థులు ఉన్నారని, 7గురే టీచర్లు ఉండటంతో ఉపాధ్యాయల సమస్య ఉందని డీఈఓ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువచ్చారు. ఇంకా ముగ్గురు ఉపాధ్యాయులు కావాలన్నారు. అనంతరం ఆయన శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. అక్కడ ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీను నాయక్ ఆహ్వానించి పాఠశాల గురించి వివరిం చారు. పాఠశాలలో 1070 మంది విద్యార్థులు ఉన్నారని, 44 గదులు, సరిపోను టీచర్లు ఉన్నారన్నారు

**రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన డీఈఓ :**

శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఆయన నేరుగా రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కు చేరుకున్నారు. డీఈఓ వచ్చారని తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎంఈఓ శంకర్ రాథోడ్ కూడా రాజేంద్రనగర్ కు వచ్చారు. ఇద్దరు కలిసి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు గురించి ప్రత్యక్షంగా చూశారు. వారికి పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు జూపల్లి శ్రీనివాస రావు పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. పాఠశాలలో 900 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఇద్దరు ఇంగ్లీషు టీచర్లు కావాలని, ఒక ఫిజికల్ డైరెక్టర్ కావాలన్నారు. దానికి స్పందించిన డీఈఓ వెంకటేశ్వర్లు త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటానన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ లో శిక్షణ పొందుతున్న 100 మంది సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మారుతున్న కాలనుగుణంగా సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు తాము నేర్చుకున్న విషయాలను తరగతి గదులలో అమలు చేయాలన్నారు. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనిటీ టెక్నాలజీ ఆధారంగా విద్యార్థులకు విద్యాబోధన చేయాలన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఏ రంగానికి వెళ్లాలనుకున్నా ఆ రంగంలో రాణించేలా వారిని సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఆయన ప్రాథమిక పాఠశాలకు వెళ్లగా అక్కడ ఆయనకు ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు అరుణ పాఠశాల పరిస్థితుల గురించి వివరించారు. ఈ సందర్భంగా డీఈఓ వెంకటేశ్వర్లు విద్యార్థులను లేపి ఇంగ్లీషు చదివించారు.


బృందావన్ కాలనీలో మాజీ కార్పొరేటర్ పర్యటన

## బృందావన్ కాలనీలో మాజీ కార్పొరేటర్ పర్యటన

**బుద్వేల్, జూలై 14 (నమస్తే ఉదయం)**


మైలార్దేవుపల్లి డివిజన్ బృందావన్ కాలనీలో మంగళవారం మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రోడ్ల సమస్య, డ్రైనేజీ సమస్యలు, మ్యాన్వాల్ కవర్స్ లాంటి చిన్న చిన్న సమస్యలను కూడా అధికారులు పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. జలమండలి, ఇంజనీరింగ్ అధికారులు బస్తీలు, కాలనీలలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రావుల భాస్కర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్ ఇన్స్పెక్టర్గా ఎ.సీతయ్య

**బుద్వేల్, జూలై 14 (నమస్తే ఉదయం)**




అత్తాపూర్ పోలీస్ ఇన్స్పెక్టర్ గా ఎ సీతయ్య సోవ-ంవారం బాధ్యతలు స్వీకరించారు. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ గా పనిచేసిన కె నాగేశ్వర్ రావు సైఫాబాద్ కు బదిలీ కావడం తో ఆయన స్థానంలో సైఫాబాద్ ఇన్స్పెక్టర్ గా పనిచేసిన ఎ సీతయ్య అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎ సీతయ్య మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణ లో తన వంతు కృషి చేస్తానన్నారు.




## ఘనంగా మట్టెద్దుల అమావాస్య

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 14(నమస్తే ఉదయం):**

జోగుళాంబ గద్వాల జిల్లాలో రైతులు మట్టెద్దుల అమావాస్యను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణలోని కేటిదొడ్డి మండలంతో పాటు, పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సరిహద్దు ప్రాంతాలలో కూడా ఈ మట్టెద్దుల అమావాస్యను జరుపుకోవడం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీగా కొనసాగుతోంది. పశుగ్రాసం, వ్యవసాయం సమృద్ధిగా సాగాలని, పంటలు బాగా పండాలని కోరుకుంటూ రైతులు ఈ సాంప్రదాయాన్ని ఘనంగా నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి అనంతరం వచ్చే ఈ అమావాస్య రోజు కుమ్మరులు ఒండ్రు మట్టితో తయారు చేసిన మట్టెద్దులను విక్రయిస్తారు. రైతులు, వ్యవసాయ భూములు ఉన్నవారు మట్టెద్దులను కొనుగోలు చేసి, గరక, పూలు, పసుపు, కుంకుమతో అలంకరించి, పూజలు చేశారు. పండుగను పురస్కరించుకొని భక్షాలు (బొబ్బట్లు) , వివిధ రకాల తీపి వంటకాలను నైవేద్యంగా సమర్పించి, కుటుంబ సభ్యులతో కలిసి ఆరగించారు.



## శ్రీశ్రీశ్రీ అరణ్యేశ్వర స్వామి దేవాలయానికి 70 ప్లేట్లు విరాళం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 14(నమస్తే ఉదయం)**

ధరూర్ మండలం కోతులగిద్ద గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ అరణ్యేశ్వర స్వామి దేవాలయంలో అన్న సమర్పణ దాతల సహకారంతో దేవాలయ కమిటీకి 70 ప్లేట్లను విరాళంగా సమర్పించారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా దాతలు ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... స్వామివారి అన్న సమర్పణ కార్యక్రమానికి సహకరిస్తూ, ఆలయ అభివృద్ధికి తోడ్పడుతున్న దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. దాతల సేవాభావం అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# బీఎలు ఇంటింటికి రావాలి: ఓటర్లు


**బుద్వేల్, జూలై 14 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలోని బస్తీలు, కాలనీలలో ఓటరు నమోదు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం జోరుగా సాగుతుంది. బూత్ లెవల్ ఆఫీసర్లు, అధికారులు బస్తీల కూడళ్లు, పోలింగ్ బూత్లు, కమ్యూనిటీ హాల్లు, పార్కుల వద్ద కూర్చుని ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకుంటున్నారు. కొందరు అపార్ట్మెంట్ల కు వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేస్తున్నారు.


మేకల వనితా రెడ్డి

**అత్తాపూర్ సర్కిల్ చైతన్య విలాస్ కాలనీ పరిసర కాలనీల వాళ్లు చైతన్య విలాస్ కాలనీ పార్కులో ఫారాలను అందజేయాలి: బీజేపీ నాయకురాలు మేకల వనితా రెడ్డి**

చైతన్య విలాస్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, మారుతి ఎంక్లేవ్, ఎర్రబొడ కాలనీ వాసులు ఎన్యుమరేషన్ ఫారాలను ఇంకా బీఎల్ ఓ లకు ఇవ్వకుంటే చైతన్య విలాస్ కాలనీలో వారు అందుబాటులో ఉంటారని, అక్కడ ఇవ్వవచ్చని బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు మేకల వనితా రెడ్డి తెలిపారు. 212,213,214, 243 పోలింగ్ బూత్ లలో ఉండే వారు చైతన్య విలాస్ పార్కులో కి రావాలన్నారు


ఉప్పర్ పల్లిలో ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేస్తున్న బీజేపీ నాయకులు పలుగు చెరువు నరేందర్

**ఉప్పర్ పల్లి లో బీజేపీ నాయకులు పలుగుచెరువు నరేందర్ ఆధ్వర్యంలో....**

బీజేపీ నాయకులు పలుగుచెరువు నరేందర్ ఆధ్వర్యంలో ఉప్పర్ పల్లి లో ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి బీఎల్ ఓ లకు ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రతి ఒక్కరు ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఇవ్వాలని సూచిస్తున్నారు.

**ప్రేమావతిపేట్ లో ఎడ్లకాడి సూర్యం ఆధ్వర్యంలో...**

ప్రేమావతిపేట్ లో బీఆర్ఎస్ నాయకులు ఎడ్లకాడి సూర్యం ఆధ్వర్యంలో ఎన్యుమరేషన్ ఫారాలను నింపి బీఎల్ఓ లకు అందజేస్తున్నారు. ఈ నెల 24 లోగా ప్రతి ఒక్కరు ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఇవ్వాలని ఆయన ఓటర్లను కోరారు.

**ఇంటింటికి రావడం లేదు ఓటర్లు :**

బీఎల్ ఓ లు ఇంటింటికి రావడం లేదని రాజేంద్రనగర్ కు చెందిన కె శంకర్ రావు. బుద్వేల్ కు చెందిన ఎస్ రామ్మోహన్ రావు , మార్కండేయనగర్ కు చెందిన వర్కాల చందు, బవానీకాలనీకి చెందిన ఎం ప్రేం రాజు అన్నారు. చౌరస్తాలు, కాలనీ కూడళ్ల వద్ద కూర్చుని ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్ ఓ లు తీసుకు ంటున్నారని. అలా కాకుండ ఇంటింటికి వస్తే బాగుంటుందన్నారు.



## కార్మికులకు అండగా ఏఐటీయూసీ

### కామ్రేడ్ వనపల్లి జైపాల్ రెడ్డి

**రాజేంద్రనగర్,జులై14(నమస్తే ఉదయం):**

కార్మికుల సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ చొరవ మరువలేనిదని రంగారెడ్డి జిల్లా ఏఐటియుసి కార్యదర్శి,తెలంగాణ మున్సిపల్ స్టాఫ్,కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వనపల్లి జైపాల్ రెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల కేంద్రంలో ఏఐటియుసి ఐదవ మహాసభను పట్టణ కేంద్రంలో నిర్వహించారు.ఈ మహాసభలో నూతన ఏఐటియుసీ మండల కౌన్సిల్ ను ఎన్నుకున్నారు.ఎల్ఐటి హోటల్లో నూతనంగా ఎన్నికైన శంషాబాద్ మండల గౌరవ అధ్యక్షులు నర్రాగిరి,అధ్యక్షులు టి.శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి గిలక రాజు,ఉపాధ్యక్షులు దండు రవికుమార్,ఎద్దుల శ్రీనులను మహాసభలో కార్మికులు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.వనంపల్లి జైపాల్ రెడ్డి వారికి ఘనంగా శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు.ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ..శంషాబాద్ మండలంలో ఏఐటియుసి అన్ని రంగాల్లో విస్తరింపజేసి బలోపేతం చేయాలని కార్మికుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించాలని తెలిపారు.


శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీలో డ్రైనేజ్ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతా: ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్

**బుద్వేల్, జూలై 14 (నమస్తే ఉదయం)**


శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీలో రూ. 23.5 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజ్ పైప్లైన్ పనులకు మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే నా లక్ష్యం అన్నారు. శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీలో డ్రైనేజీ పైపు లైన్ పనులు పూర్తయితే ఇక్కడి ప్రజలు చాలా కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు దూరమౌతాయన్నారు. కాలనీ వాసులు పలుమార్లు ఈ సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో తాను అధికారులతో మాట్లాడి పనులను మంజూరు చేయిం చడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి కృషి చేసు న్నానన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ జలమండలి డీజీఎం జవహార్ అలీ, మేనేజరు వెంకటేశ్ గౌడ్, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్, కాంగ్రెస్ నాయకులు రగడం పల్లి శ్రావణ్, స్థానిక నాయకులు దాసరి రమేశ్, శివ కుమార్, పురుషోత్తం, హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కార్మికులకు సంక్షేమ కార్డులు అందచేస్తున్న సీ ఐ టీ యూ నాయకులు ఎం చంద్రమోహన్

## ప్రతి కార్మికుడు సంక్షేమ కార్డులను తీసుకోవాలి

**బుద్వేల్, జూలై 14 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ మండలం లో భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరు ప్రభుత్వం కార్మికశాఖ ద్వారా అందజేసే సంక్షేమ కార్డులు తీసుకోవాలని సీఐటీయు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ కోరారు. మంగళవారం కాటేదాన్ లోని సీఐటీయు కార్యాలయంలో 100 మంది కార్మికులకు నూతనంగా చేయించిన సంక్షేమ కార్డులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వం కార్మికులకు ఇవ్వాల్సిన అన్ని సౌకర్యాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు జె రుద్రకుమార్, ఎస్ రామ్మోహన్, బి వెంకటయ్య, బి స్వామి, తదితరులు పాల్గొన్నారు.


జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కి వినతి పత్రం అందచేస్తున్న మార్కండేయనగర్ యువకులు

## మార్కండేయనగర్ పోలింగ్ బూత్ను శివరాంపల్లిలో కాకుండ బాబుల్రెడ్డినగర్లోనే ఏర్పాటు చేయాలి

**బుద్వేల్, జూలై 14 (నమస్తే ఉదయం):**

అత్తాపూర్ సర్కిల్ మార్కండేయనగర్ బస్తీ కి చెందిన పోలింగ్ బూత్ శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో ఉందని, దానిని మార్కండేయనగర్ లేదా బాబుల్ రెడ్డి ప్రాంతానికి మార్చాలని కోరుతు కాలనీ కి చెందిన యువకులు మంగళవారం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ని కలసి వినతి పత్రం అందజేశారు. కాలనీ కి చెందిన 400 మంది ఓటర్లు 2002 నుంచి శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీ కి వెళ్లి ఓటు వేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. శివరాంపల్లి దూంరంగా ఉండటంతో చాలా మందికి ఇబ్బంది అవుతుందన్నారు. జోనల్ కమిషనర్ స్పందిం చి పోలింగ్ స్టేషన్ ను బాబుల్ రెడ్డి నగర్ పాఠశాలకు మార్చాలన్నారు. జోనల్ కమిషనర్ ను కలసిని వారిలో సానిక యువకలు యాదగిరి, భాస్కర్, ఎస్ మల్లేశ్, గంజి ధనుంజయ్, బి శివ, ఉడుత రమేశ్ లు ఉన్నారు.

# విద్యార్థుల కష్టాలను తీర్చిన... ఎమ్మెల్యే

### చెట్ల కింద చదువుల నుంచి... సురక్షిత భవనంలోకి...

**కొత్తకోట, జూలై 14(నమస్తే ఉదయం)**





దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకుంటూ దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండల కేంద్రంలో బాలికల పాఠశాలకు కొత్త భవనం నిర్మించారు. విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి గతంలో విద్యార్థులకు ఇచ్చిన మాట మేరకు పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయించారు. రూ.కోటి.50 లక్షలతో కొత్త భవనం..వనపర్తి జిల్లా కొత్తకోట పాఠశాలకు సుమారు రూ. కోటి.50 లక్షల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో కొత్త భవనం నిర్మించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్మాణం "ఎమ్మెల్యే జిఎంఆర్" చేపట్టారు.

**నాడు విద్యార్థులకు ఇచ్చిన హామీ..**

కొత్తకోట మండల కేంద్రంలో ప్రభుత్వ బాలికల పాఠశాలకు సరైన భవనం మరియు వసతులు లేక విద్యార్థులు గత కొన్ని సంవత్సరాలుగా చెట్ల కింద కూర్చొని విద్యాభ్యాసం సాగిస్తున విషయంపై "ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి " ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థుల కష్టాలను స్వయంగా చూసి చలించిన ఆయన పాఠశాల భవనం నిర్మాణంపై హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తూ భవనాన్ని అందుబాటులోకి తీసుకు వస్తున్నారు.రేపు జూన్ 15న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం విద్యార్థులకు అందుబాటు లోకి..ఈ కొత్త పాఠశాల భవనం జూన్ 15 నుంచి విద్యార్థులకు అందుబాటులోకి రానుంది.విద్యార్థులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన తరగతి గదులు అందుబాటులో ఉంటాయి.

**స్థానికుల హర్షం...**

పాఠశాల కొత్త భవనం నిర్మాణంతో స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యా సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారు అభినందిస్తున్నారు.

**విద్యా రంగంపై ప్రభుత్వం దృష్టి...**

విద్యా రంగ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న 'ఎమ్మెల్యే జిఎంఆర్' . పట్టణం , గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల మౌలిక వసతుల మెరుగుదల కోసందేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మరిన్ని కార్యక్రమాలు చేపట్టబోతున్నామన్నారు.కొత్తకోటలో పాఠశాల ప్రారంభోత్సవం చేయనన్న సీఎం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో బాలికల పాఠశాల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు సంబంధించి చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ దిశనిర్దేశం చేస్తారన్నారు.



# జన జాగరణ యాత్రను విజయవంతం చేయండి

### జన జాగరణ యాత్ర గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 14(నమస్తే ఉదయం)**

గద్వాల ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో సిపిఎస్ రద్దుకై జూలై 17న సాయంత్రం 4 గంటల నుండి జరిగే జన జాగరణ యాత్ర గోడపత్రికను సిపిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నరసింహ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పేన్షన్ విధానం పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండున్నర సంవత్సరాలు అయినా రద్దు దిశగా ఆలోచన చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కోసం ఎన్నికైన ప్రజాప్రతినిధులకు జీవితాంతం పెన్షన్ ఉంటుంది. కానీ 30 సంవత్సరాలు ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షన్ లేకపోవడం దారుణం అన్నారు. ఎమ్మెల్యేలకు ఎంపీలకు ఒక్కొక్కరికి రెండు పెన్షన్లు ఉండొచ్చు కానీ బతకడానికి మాకు మాత్రం ఒకపెన్షన్ కూడా అవసరం లేదా అన్నారు.జూలై 17న మధ్యాహ్నం 2గంటల నుండి మన జిల్లాలోకి రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్ ల ఆధ్వర్యంలో జన జాగరణ యాత్ర బస్సు ప్రవేశిస్తుంది. కావున ఇళ్లలోనే ఉద్యోగులు ఉపాధ్యాయులు వివిధ సంఘాల ప్రతినిధులు అత్యధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నరసింహ,సిపిఎస్ నాయకులు ఆంజనేయులు, మురళీధర్ రెడ్డి, రాఘవేంద్ర, షేక్షావలి, అలంపూర్ కృష్ణ, గజేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యం

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### టైలర్స్ కాలనీలో రూ.55 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

**పటాన్ చెరు, జూలై 14 (నమస్తే ఉదయం):**

అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, రక్షిత మంచినీటి సరఫరా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. అమీన్ పూర్ డివిజన్‌లోని టైలర్స్ కాలనీలో జలమండలి ఆధ్వర్యంలో రూ. 55 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యేలా మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ ప్రాంతంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరాను మరింత బలోపేతం చేయడానికి నూతన పైపులైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయిన అనంతరం టైలర్స్ కాలనీ ప్రజలు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి అన్ని మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ప్రతి కాలనీని ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, జలమండలి జిఎం శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం శివ, ఏఈ శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, జగదీష్, గోపాల్, రాములు, చంద్రశేఖర్, రాజు, బాలరాజు, స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

**గద్వాల ప్రతినిధి, జూలై 14(నమస్తే ఉదయం)**ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం తపస్ (టి యు పి ఎస్) ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి ధర్నా కార్యక్రమానికి నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు సంఘీభావాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైనప్పటికీ ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడలేదని విమర్శించారు. నూతన పీఆర్సీ (పి ఆర్ సి)ని ప్రకటించకపోవడం, బకాయి ఉన్న డీఏ (డి ఏ)లను విడుదల చేయకపోవడం వల్ల ఉపాధ్యాయ వర్గంలో తీవ్ర అసంతృప్తి, ఆందోళన నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్ రెడ్డి, అయ్యస్వామి, జిల్లా అధ్యక్షులు రవీందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, గద్వాల పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, కౌన్సిలర్లు కుమ్మరి శ్రీను, శాలన్న, చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ త్యాగరాజు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి, మహిళా కన్వీనర్ అరుణశ్రీ , పెద్ద సంఖ్యలో తపస్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయం





### ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

### జిల్లాలో రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు.

### ఎర్రవల్లి వద్ద రూ.155 కోట్ల నిధులతో ఉప కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన.

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 14(నమస్తే ఉదయం)**

నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిధులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్చాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ. 155 కోట్ల నిధులతో 220/132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ. 376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, ఇతర ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.







ఫల్టీలు కొట్టిన కారు


మృతి చెందిన శివ





కారులోనే మృతి చెందిన శివ

మృతి చెందిన రంగస్వామి



# అదుపుతప్పి కారు బోల్తా

### ఇద్దరు మృతి... ముగ్గురికి గాయాలు.. మంత్రాలయం నుండి గద్వాలకు వస్తున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 14 ( నమస్తే ఉదయం)**

వేగంగా వెళ్తున్న కారు ఫంచర్ కావడంతో అదుపుతప్పి బో ల్తా పడింది. ఈ ప్రమాదం అయిజ మండలం మేడికొండ గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ముగ్గురికి గాయలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గద్వాలకు చెందిన రంగస్వామి(33), శివ(31), మహేందర్, నాగేంద్ర బాబు, తేజ అందరు కలిసి మంగళవారం మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకుని గద్వాలకు కారులో బయలదేరారు. మార్గం మధ్యలో అయిజ మండలం మేడికొండ గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తాపడింది. కారు నడుపుతున్న రంగస్వామితో పాటు శివ మృతి చెందారు మహేందర్, నాగేంద్ర బాబు, తేజ లు గాయపడారు. నాగేంద్ర బాబుకు తీవ్రగాయాలవడంతో చికిత్స కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. మిగత గాయపడిన వారిని వైద్యం కోసం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. రంగస్వామి, శివల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఆసుపత్రికి తరలించారు. అయిజ పోలీసులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందిన రంగస్వామికి భార్యతో పాటు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివకు భార్యతో పాటు పిల్లలు ఉన్నారు.